క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరురూరల్: తన స్వగ్రామం మహిమలూరుకు వచ్చిన డీఆర్డీఓ మాజీ చైర్మన్, భారత రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డిని పలువురు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, మెయిన్ పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మహిమలూరు పీహెచ్‌సీ అధికారులు, ఏపీజీబీ బ్యాంకు ఉద్యోగులు కలిశారు.

చెరువు చేపల వేలం



కొండాపురం : మండలంలోని కొమ్మి పంచాయతీ పరిధిలోని గండికట్ల చెరువులో చేపల పెంపకం హక్కుకు సంబంధించిన వేలం ప్రక్రియను ఇరిగేషన్ అధికారులు సోమవారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేలంలో ఇద్దరు రైతులు రూ.10వేలు చొప్పున ధరావత్తు చెల్లించి పాల్గొన్నారు. కొమ్మికి చెందిన షేక్ ఖాజామస్తాన్ రూ.40వేలకు చేపలను వేలంలో దక్కించుకున్నాడు. ఇరిగేషన్ ఏఈ రమేష్, వర్క్ఇన్‌స్పెక్టర్ యుగంధర్, స్థానికులు యడ్లపల్లి వెంకట రమణయ్య, బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన



చేజర్ల: భారత రాజ్యాంగంపై విద్యార్థుల్లో అవగాహనను ఉపాధ్యాయులు పెంపొందించాలని భారతీయ మహాసేన అధ్యక్షుడు జువ్విగుంట బాబు అన్నారు. మండలంలోని మడపల్లి ప్రాథమిక పాఠశాలలో భారత రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. అనంతరం రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎస్‌ఆర్‌ఐ జీ వెంకయ్య, ఉపాధ్యాయుడు రఘు, తదితరులు పాల్గొన్నారు.

90 డ్రమ్ముల చికెన్ వ్యర్థాల పట్టివేత



సంగం: మండలంలోని చేపల గుంతల్లో వేసేందుకు కర్ణాటక రాష్ట్రం నుంచి రెండు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 90 డ్రమ్ముల కోళ్ల వ్యర్థాలను పడమటిపాళెం వద్ద సంగం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వాటిని అటవీ ప్రాంతంలో భారీ గుంత తీసి పూడ్చివేశారు. కోళ్ల వ్యర్థాలు అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేష్ హెచ్చరించారు.

నెల్లూరుకు తరలిన సీపీఎం శ్రేణులు



ఆత్మకూరురూరల్: నెల్లూరులో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభలకు ఆత్మకూరుకు చెందిన ఆ పార్టీ శ్రేణులు సోమవారం తరలివెళ్లాయి. సీపీఎం పట్టణ కార్యదర్శి మొలబంటి నాగేంద్ర, నాయకులు ఆత్మకూరు నాగయ్య, వేముల వెంకటయ్య, ఉసురుపాటి బాలకొండయ్య, సలారుద్దీన్, తదితరులు పార్టీ శ్రేణులతో కలిసి ఎర్రజెండాలు చేతబూని ప్రత్యేక వాహనాల్లో రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.4.69 లక్షలు

అల్లూరు: అల్లూరుపేటలోని పోలేరమ్మ ఆలయ హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. ఎనిమిది నెలల కాలానికి గానూ భక్తులు సమర్పించిన నగదు కానుకలను లెక్కించగా రూ.4,69,840 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ చిట్టిబాబు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

38 మద్యం బాటిళ్ల స్వాధీనం

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో కలిగిరి ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ తన సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 38 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రేతను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దివ్యాంగులకు తప్పని పాట్లు

- ఆత్మకూరు, ఉదయగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరమ్ పరీక్షలు
- అష్టకష్టాలు పడుతూ పింఛన్ లబ్ధిదారుల హాజరు
- క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షణ



ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షల కోసం క్యూలైన్‌లో దివ్యాంగుల పడిగాపులు

ఆత్మకూరు: దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులపై ప్రభుత్వం కనికరం చూపడం లేదు. అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీ మేరకు పింఛన్ నగదును పెంచి నాలుగు నెలల పాటు అందజేసిన కూటమి ప్రభుత్వం ఆ తరువాత భారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలను మొదలుపెట్టింది. కొత్త పింఛన్లను మంజూరు చేయకపోగా వివిధ కారణాలను సాకుగా చూపుతూ కోత వేస్తూ వస్తోంది. తాజాగా అనర్హుల ఏరివేత పేరుతో దివ్యాంగులకు సదరమ్ పరీక్షలు చేపడుతోంది. అందులో భాగంగా ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సోమ, మంగళవారాల్లో దివ్యాంగ పింఛన్‌దారులకు సదరమ్ పరీక్షలు చేపడుతున్నారు. ముందస్తుగా దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం అందజేస్తున్నారు. సోమవారం 53 మందికి కళ్ల పరీక్షలు, 50 మందికి ఆర్థో పరీక్షలు చేయనున్నట్లు సమాచారం అందజేయడంతో దివ్యాంగులు అష్టకష్టాలు పడుతూ ఆస్పత్రికి చేరుకున్నారు. దివ్యాంగులు, పూర్తిగా నడవలేని వారు సహాయకుల సాయంతో తరలివచ్చారు . గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో ఇబ్బందులు పడ్డారు. ఏళ్ల తరబడి దివ్యాంగ పింఛన్లు పొందుతున్నా మళ్లీ పరీక్షలు చేయాలని చెప్పడంతో సహాయకులను వెంటబెట్టుకుని అష్టకష్టాలు పడుతూ వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.

సదరమ్ సర్టిఫికెట్ల పరిశీలన

ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల సదరమ్ సర్టిఫికెట్లను వైద్యాధికారులు సోమవారం పునఃపరిశీలన చేశారు. గతంలో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సీఎస్ రాజు లబ్ధిదారులకు మంజూరు చేసిన ధ్రువీకరణపత్రాలను పరిశీలించి మళ్లీ వైద్యపరీక్షలు నిర్వహించారు. వారంలో మూడురోజుల పాటు రోజుకు యాభై మంది లబ్ధిదారులకు సంబంధించి పరీక్షలు చేసి అర్హులను గుర్తించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఎంపీడీఓ అప్పాజీ, ఏపీఎం ఖాజారంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో దివ్యాంగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎన్నో ఏళ్లుగా తీసుకుంటున్నా..



నాకు రెండు కళ్లు కనిపించవు. చెవుడు కూడా ఉంది. ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. మందులకే పింఛన్ నగదు సరిపోతుంది. ఎన్నో ఏళ్లుగా పింఛన్ పొందుతున్నా ఇప్పుడు మళ్లీ పరీక్షలు చేయాలని ఆస్పత్రికి రమ్మన్నారు. పొరుగింటి ఆమెను తోడు తీసుకుని ఇబ్బందులు పడుతూ వచ్చా.

– షేక్ బషీరున్నీసా, దివ్యాంగురాలు, ఆత్మకూరు

ఆటో తీసుకొని వచ్చా



నాకు పక్షవాతం రావడంతో కాళ్లు, చేతులు పనిచేయడంలేదు. దీనికితోడు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో ఆపరేషన్ చేశారు. అప్పటి నుంచి సరిగ్గా మాటలు కూడా రావడంలేదు. నా మందులకు పింఛన్ డబ్బులే ఆధారం. ఈ రోజు పరీక్షలు చేయాలి ఆస్పత్రికి రమ్మన్నారు. బంధువుల సాయంతో ప్రత్యేకంగా ఆటో తీసుకుని వచ్చా.

– కామాక్షమ్మ, బోయలచిరివెళ్ల, ఆత్మకూరు

గతంలో పరీక్షలు చేసినా..



నాకు కళ్లు కనిపించవు. ఇతరుల సాయంతోనే నడవాల్సిన పరిస్థితి. గతంలో అన్ని పరీక్షలు చేసి పింఛన్ ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు పరీక్షలు చేయాలంటే కాగితాలు తీసుకుని బంధువు సాయంతో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రికి రావాల్సి వచ్చింది.

–జీ పోలయ్య, ఆత్మకూరు

వైభవంగా వసంతపంచమి పూజలు

సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి పీఠంలో వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి లలితా సహస్రనామం, శ్రీచక్ర నవావరణ కుంకుమార్చన, నవావరణ పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి మాఘమాసంలో వచ్చే వసంత పంచమి విశిష్టతను భక్తులకు వివరించారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



మర్రిపాడు: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు ఆత్మకూరు ఎంవీఐ రాములు ఆధ్వర్యంలో సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ఈ పోటీలను నిర్వహించినట్లు ఎంవీఐ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా జనార్దనస్వామి కల్యాణోత్సవం



మాంగళ్యాన్ని భక్తులకు చూపుతున్న వేద పండితులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- ముగిసిన జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలోని శ్రీదేవి,భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు వేద పారాయణం, కలశారాధనలు, యంత్ర, ప్రతిష్ఠ, విమాన కలశప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, మహాసంప్రోక్షణ, విశ్వరూప సందర్శనం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై దేవదేవేరుల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి నేత్రపర్వంగా కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. కాగా చిన్నజీయర్‌స్వామి విగ్రహ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులను ఆశీర్వదించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్,, ఆలయ చైర్మన్ మాదాల బాబురావు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ చంచలబాబుయాదవ్, మాదాల తిమ్మయ్యచౌదరి, గోగినేని రామచంద్ర, మల్లంపాటి గురవయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో ఆదర్శ పాఠశాల

వరికుంటపాడు: ప్రభుత్వం నూతన సంస్కరణల్లో భాగంగా ప్రతి పంచాయతీలో ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంఈఓ–2 సీహెచ్ రమణయ్య తెలిపారు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లి క్లస్టర్ ఉన్నత పాఠశాలలో జీఓ నంబర్ 117 రద్దుపై ఉపాధ్యాయులకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. మండలంలో మూడు స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటి పరిధిలో ఫౌండేషన్, బేసిక్, మోడల్, ఉన్నత పాఠశాలలు ఉంటాయన్నారు. ప్రతి పంచాయతీలో మోడల్ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు

ఆత్మకూరు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు అందాయి. ఓ విద్యార్థి బీఎస్సార్ కళాశాలలో సర్టిఫికెట్ల కోసం ఫీజు అధికంగా అడుగుతున్నారని ఆర్డీఓ పావనిని కలిసి ఫిర్యాదు చేయగా డీటీని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే నువ్వూరుపాడు గ్రామస్తులు తమ గ్రామంలోని పాఠశాలలోని కొన్ని తరగతులను అశ్వనీపురం పాఠశాలలో విలీనం చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, నాలుగు కిలోమీటర్ల దూరంలోని అశ్వనీపురం పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆర్డీఓకు విన్నవించారు. స్పందించిన ఆర్డీఓ ప్రభుత్వ పాలసీ మేరకు పాఠశాలలను విలీనం చేస్తున్నారని, విలీన పాఠశాలలకు వెళ్లేందుకు ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.6 వేలు రవాణా చార్జీలు అందజేస్తారని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే మర్రిపాడు, కలువాయి మండలాలకు చెందిన పలువురు రైతులు భూ సమస్యలపై ఆర్డీఓకు అర్జీలు అందజేయగా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు.

వైభవంగా జీర్ణోద్ధరణ ఉత్సవాలు ప్రారంభం



నూతన విగ్రహాల ఊరేగింపు



ధ్వజస్తంభాన్ని ఊరేగింపుగా తరలిస్తున్న భక్తులు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో నూతన సీతారామలక్ష్మణఆంజనేయస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. గ్రామానికి చెందిన డీఆర్డీఓ మాజీ చైర్మన్, భారత రక్షణశాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి, పద్మావతి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నర్రవాడ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి



స్టేజీను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో దాత రామినేని వెంగయ్య రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన స్టేజీను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం దాత రామినేని వెంగయ్యను అభినందించారు. తొలుత వెంగమాంబ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఈఓ ఉషశ్రీతో మాట్లాడి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ పీ చెంచలబాబుయాదవ్, కాకర్ల సునీల్, కాకర్ల వెంకట్, మాలేపాటి చైతన్య, గురవయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అపస్‌కు నగదు విరాళం అందజేత



ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్)కు జిల్లా వైఎస్సార్‌సీపీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్ రూ.15వేలు నగదు విరాళాన్ని అందజేశారు. సోమవారం రాత్రి అపస్ నాయకుడు అనిల్ కుమార్ కార్యవర్గ సభ్యులతో పాటు డాక్టర్ ప్రణీత్‌ను కలిశారు. ఈ సందర్భంగా అనంతసాగరంలో ఈ నెల 9న నిర్వహించనున్న ప్రతిభా పరీక్షలో తొలి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ప్రోత్సాహక నగదు బహుమతులను ప్రదానం చేయాలని నగదు చెక్కును అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, టీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన రేపు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలోని గ్రామ సచివాలయంలో బుధవారం పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్సై తిరుమలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు పంచాయతీ కార్యదర్శి రామయ్యను ఫోన్‌లో సంప్రదించి పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కోరామని చెప్పారు. అందుకు స్పందించిన ఆయన ఉదయం 11 గంటలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్‌ను పూర్తి చేయాలి

వరికుంటపాడు: పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ నిర్మాణ పనులపై పాలకులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉదయగిరి డివిజన్ జనవిజ్ఞాన వేదిక నాయకులు షేక్ దస్తగిరిఅహ్మద్, జీ రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు నిర్మాణానికి 1995లో శంకుస్థాపన చేసిన పనులు వేగవంతంగా జరగడం లేదన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పరిసరాల్లో కంప చెట్లుఏపుగా పెరిగి అటవిని తలపిస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే మెట్టప్రాంతంలోని 80 వేల ఎకరాల బీడు భూములు ఉపయోగంలోకి రావడంతో పాటు సాగు, తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులు వేగవంతం చేసి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని కోరారు.

ఆటో బోల్తా... నలుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు

సీతారామపురం: మండలంలోని చిన్నాగంపల్లి వద్ద సోమవారం సీతారామపురం నుంచి పామూరు వైపు వేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలోని ప్రకాశం జిల్లా పామూరు ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు, శంకర్, కృష్ణ, అంజి గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో వెంకటేశ్వర్లు తలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19న సుబ్బయ్య బడిలో వందేళ్ల పండగ



విద్యార్థులతో కలసి ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం చెంచయ్య

అల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(సుబ్బయ్య బడి)లో ఫిబ్రవరి 19న వందేళ్ల పండగ నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం చెంచయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను విద్యార్థులతో కలిసి హెచ్‌ఎం సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925లో వేమూరు శేషయ్య తన కుమారుడు వెంకటసుబ్బయ్య పేరుతో తన స్వగృహంలో పాఠశాలను ప్రారంభించారని చెప్పారు. ఆ తరువాత హిందూ స్కూల్‌గా బ్రిటీష్ ప్రభుత్వంతో గుర్తింపబడిందని, శేషయ్య కుటుంబ సభ్యులు వెంకటసుబ్రహ్మణ్యం కరస్పాండెంట్‌గా, శేషగిరిరావు ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించారని తెలిపారు. 1983లో మండల పరిషత్ ప్రాథమికోన్నత, 2020లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందిందని వివరించారు. అల్లూరు ప్రజల ఆదరణ పొందిన సుబ్బయ్య బడి వందవసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వందేళ్ల పండగను ఘనంగా నిర్వహించాలని సంకల్పించినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొని పండగను జయప్రదం చేయాలని కోరారు. వందేళ్ల పండగకు హాజరయ్యే పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ పేర్లను 99492 03922 నంబరుకు వాట్సప్ లేదా మెసేజ్ రూపంలో తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

గుడి ముసుగులో గ్రావెల్ అక్రమ రవాణా



మినగల్లు వద్ద దుకాణం ఏర్పాటుకు గ్రావెల్‌ను డంప్ చేస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండలంలో కొందరు అక్రమార్కులు గుడి ముసుగులో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ, ప్రభుత్వ భూముల నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని కొత్తపల్లి, వెంకటరెడ్డిపల్లి గ్రామాల సమీపంలోని అటవీ, ప్రభుత్వ భూముల నుంచి గత మూడ్రోజులుగా గ్రావెల్‌ను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. తాజాగా సోమవారం వెంకటరెడ్డిపల్లి నుంచి మినగల్లు గ్రామం వద్ద ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసుకుంటున్న దుకాణం కోసం మట్టిని తరలిస్తూ కనిపించారు. ట్రాక్టర్ల డ్రైవర్లను ప్రశ్నిస్తే మాత్రం రేవూరులోని గుడి నిర్మాణానికి గ్రావెల్‌ను తరలిస్తున్నట్లుగా సమాధానమిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమ పరిధిలోకి రాదని, మైనింగ్ అధికారుల పరిధిలోకి వస్తుందని చెబుతూ తప్పించుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. అటవీ ప్రాంతాల సమీపంలో భారీ స్థాయిలో గుంతలు చేస్తే వన్యప్రాణులకు ఇబ్బందికరంగా మారుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఉపకరణాలు

సీతారామపురం: అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాలు అందజేస్తామని సీడీఈఐసీ ఫిజియోథెరపిస్ట్ రాకేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీకి సంబంధించి సోమవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిళ్లు, వీల్‌చైర్లు, వాకర్లు, టీఎల్ఎం కిట్ల కోసం 37 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిని పరిశీలించిన అధికారులు అర్హులందరికీ అవసరమైన ఉపకరణాలను త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈఓపీఆర్డీ భార్గవి, టెక్నీషియన్ స్తుతులికా మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలిగిరి: కలిగిరి, వింజమూరు మండలాల్లోని గౌడ కులస్తులకు ఒక్కో మద్యం దుకాణాన్ని కేటాయించడం జరిగిందని, వాటికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కలిగిరి ఎక్సైజ్ సీఐ అబ్దుల్‌జలీల్ సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన గౌడ కులస్తులు తహసీల్దార్ వద్ద నుంచి ఉప కులధ్రువీకరణ పత్రాన్ని తీసుకుని రూ.2లక్షలు చొప్పున ధరావత్తు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక వ్యక్తి రూ.2 లక్షలు చొప్పున ధరావత్తు చెల్లించి ఎన్ని దరఖాస్తులైన చేసుకోవచ్చునని తెలిపారు.

సరస్వతీదేవికి విశేష పూజలు



పంటవీధిలోని ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

ఆత్మకూరు: వసంతపంచమని పురస్కరించుకుని పట్టణంలోని పంటవీధి ఆలయం, కాశీనాయన ఆశ్రమం, అలఘునాథస్వామి ఆలయాల్లో సరస్వతీ దేవికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పంటవీధిలోని ఆలయంలో అర్చకులు జాగర్లపూడి నాగరాజశర్మ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా నున్నా సంతోష్‌కుమార్ దంపతులు వ్యవహరించారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం



ఉదయగిరి: పట్టణంలోని వాల్మీకి వీధిలో విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉంది. స్తంభం పైభాగంలో విరిగిపోయి ఏ క్షణంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇటీవల పట్టణంలో ఓ ఇంటి ప్రహరీపై విద్యుత్ స్తంభం కూలిందని, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని గుర్తుచేశారు. స్తంభం కూలి ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందిస్తారా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం తొలగించి కొత్తది ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.